# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం | 17 జూలై 2025 | పేజీలు 8


- సీఎం సన్నిహితుడి సిఫార్సు.. అక్రమ రోడ్డుకి "అధికారుల సమన్వయ కృషి..
- అక్రమమే అయినప్పటికీ..! అధికారికంగా సహకరిస్తున్న మున్సిపల్-రెవెన్యూ..
- దుండిగల్‌లో..! అధికారుల బాధ్యతా రహితమా..? చేతివాటమా..?
- తొడగొట్టి సవాల్ విసురుతూ ప్రభుత్వ భూమి ఆక్రమణతో రోడ్డు నిర్మాణం..!
- హలో..దిస్‌ఈజ్ సీఎం పేషీ..? అధికారుల అందరికీ పైనుండి "ఫోన్ కాల్స్"..
- ఐఏఎస్ లు సైతం సైలెంట్.. అదనపు కలెక్టర్‌లు కూడా మౌనం..
- చందమామ కథలు చెపుతున్న మున్సిపల్ కమిషనర్-తహశీల్దార్..
- అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి (రెవెన్యూ) ఆదేశాలను బేఖాతర్..!
- లోకల్‌బాడీ అదనపు కలెక్టర్‌కి ఈ రోడ్డు వ్యవహారం తెలుసా..? తెలియదా..?
- ఇద్దరు అడిషనల్ కలెక్టర్‌ల నిర్లక్ష్యం.. అపుడు బహదూర్‌పల్లిలో..ఇప్పుడు బౌరంపేట్‌లో..
- రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిలో అక్రమార్కులకి వక్రమార్గంలో రోడ్లు..
- పై స్థాయిలో అడిగేవారు లేరు..! కింది స్థాయిలో పనులు ఆపేవారు లేరు..!
- రూ.కోట్ల భూ కుంభకోణంతో సర్కారు భూమి ఖతం..! "వాట్ ఏ కో-ఆర్డినేషన్ సర్‌జీ"..!
- తనకేమి తెలియదు అంటూనే.. కమిషనర్ వెంకటేశ్ నాయక్ సర్వేకు తహశీల్దార్‌కి లేఖ..
- తహశీల్దార్ మతీన్.. లేఖ సాకుతో "సర్వేకి" సర్వేయర్‌ను ఆదేశించడంపై సందేహం..
- ప్రభుత్వ భూముల్లో అక్రమ రోడ్లకు దుండిగల్ తహశీల్దార్‌లకి కొత్తేమి కాదు..?
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ అండ్ అదనపు కలెక్టర్‌లకి తెలియకుండా సాధ్యమేనా..?
- యంత్రాంగానికి టీ-కాఫీలు మొదలు.. అన్న పానీయాలు కూడా ఆ గెస్ట్‌హౌస్‌లోనే..?
- బీఆర్ఎస్ నేతల సిఫార్సుల వాడకం కన్న.. కాంగ్రెస్ నేతల సిఫార్సులే మిన్న..
- మల్లంపేట్ ప్రణీత్ అక్రమ నిర్మాణానికి కలిపే టౌన్‌ప్లానింగ్‌తో ఒప్పందం..



# అంతా.. మా ఇష్టం..! మా ప్రభుత్వం..!

### పనులు యధాతథం..! చర్యలు శూన్యం..!

### విచారణ అధికారిగా మల్కాజిగిరి ఆర్డీవో..!

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం.. మునుపెన్నడూ(ఉమ్మడి రాష్ట్రలో) చూడని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి..? ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలకు కొమ్ము కాయడం తెలంగాణ అధికార యంత్రాంగానికి అలవాటై పోయింది..! ఈ వ్యవహారంలో ప్రభుత్వ భూములు కట్టబెట్టేందుకు అయినా..! అక్రమ కేసులు బనాయించడంలో అయినా అధికార యంత్రాంగమే కీలక పాత్రను పోషించడం విశేషం..! గత బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు, నేతల మెప్పు పొదేందదానికే కావచ్చు..! కోట్లు దండు కోవడానికైనా కావచ్చు..! తప్పుడు "సలహాలు-సూచనలు" ఇస్తూ..! చివరికి ఇరుక్కు పోయిన ఐఏఎస్ అధికారుల పరిస్థితిని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో గమనిస్తున్నాం..! బహుశా ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వర్తిస్తే ఈ పరిస్థితి దాపురించేది కాదేమో..! గత ప్రభుత్వంలో అధికారుల నిర్వాకంతో నెలకొన్న పరిస్థితులపై..! ఇప్పుడు తలనొప్పిగా తయారై విచారణలు, కేసులు చూస్తున్నాం..! ఈ వ్యవహారం మొత్తం షోషల్ మీడియాలో నిత్యం చూస్తున్న ఘటనలే..! మేడ్చల్ జిల్లా యంత్రాంగం కూడా, ఈ అక్రమ రోడ్డు నిర్మాణంతో.. అదే ఘటనలు పునరావృతం చేస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త చట్టానికి ఎవరూ అతీతులు కారు..! హాస్యాస్పద విషయం ఏమిటంటే..! బౌరంపేట్ డాలర్‌మెడోస్ రోడ్లకు తాము స్థలం ఇవ్వలేదని "రైతులు కథ అడ్డం తిరిగుతున్న" విషయం తెలిసిన కమిషనర్ కూడా..! ఈ రోడ్డు వేయడానికి సహకరించి..! భవిష్యత్తులో బౌరంపేట్ "డాలర్‌మెడోస్" తరహా ఘటనలకు బీజం వేస్తున్నారని స్పష్టమవుతుంది..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 16:

-మిగతా 2లో



ప్రభుత్వ భూమిలో నిరంతరాయంగా రోడ్డు నిర్మాణ పనులు..

# భారత్‌కు అర్జెంటీనా విశ్వసనీయ భాగస్వామి



హైదరాబాద్ పెన్ పవర్:భారతదేశానికి అర్జెంటీనా విశ్వసనీ యమైన భాగస్వామి అని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య బలమైన దౌత్య సంబం ధాలున్నాయని, వాటిని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. అర్జెంటీనా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో భారత దేశ ప్రతినిధిగా కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. 'భారత్, అర్జెంటీనాల మధ్య చాలా అంశాల్లో సారూప్యత ఉంది. పర్యాటకం, సంస్కృతి, క్రీడలు(ఫుట్‌బాల్) తదితర అంశాల్లో ప్రజల మధ్య సంబంధాలున్నాయి. దేశంలో పెరుగుతున్న క్రిటికల్ మినరల్స్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ రంగంలో వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటాం' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్.. దసరా నాటికి పూర్తి






హైదరాబాద్ పెన్ పవర్: ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ పనులను తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. 2017లో ప్రారంభమైన ఉప్పల్– నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు కొన్నాళ్లుగా నిలిచిపోయాయి. నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆపేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతు న్నారు. గుంతల రోడ్డుపై అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని కారణాల వల్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కాలేదని,

-3లో

# అంతా.. మా ఇష్టం..! మా ప్రభుత్వం..!




**బౌరంపేట్‌లో ప్రస్తుతం రుద్ర కన్‌స్ట్రక్షన్, అండ్ జేఎన్ఎస్ నిర్మాణ సంస్థ, హెచ్ఎండిఏ అనుమతులు పొందేందుకు..! సర్వే నెం.166 ప్రభుత్వ భూమిని దాదాపు 3 ఎకరాల కబ్జాతో శరవేగంగా చేపడుతున్న 40 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి.. సంబంధిత వెంచర్ సుమారు ఎనిమిదేళ్ళ క్రితమే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రారంభించడానికి ప్రయత్నాలు జరిగాయట.. అయితే కేవలం 10 ఫీట్ల బండ్లదారి మాత్రమే ఉండటంతో హెచ్ఎండిఏ అనుమతులు లభించలేదు.. అదనంగా రైతులవద్ద కొనుగోలు చేయడానికి, అక్కడ ప్రభుత్వ భూమికూడా ఉంది.. ఈ సమస్యతో అంతకు ముందున్న కొందరు బిల్డర్‌లు, చేతులెత్తేసి వెళ్ళిపోయినట్లు సమాచారం.. ప్రస్తుతం రుద్ర కన్‌స్ట్రక్షన్ అండ్ జేఎన్ఎస్ నిర్మాణ సంస్థ రంగంలోకి దిగి..!అధికారులని మేనేజ్ చేసే ప్రక్రియతో పాటు, రోడ్డు వేసే బాధ్యతను అధికారపార్టీ నాయకుడు, సీఎం సన్నిహితుడు తీసుకుని పలుకుబడి ఫోన్ కాల్స్‌తో అధికారులని కట్టడచేస్తున్నారని, తెలుస్తోంది.. మరోవైపు జిల్లా కలెక్టర్ ఆదేశించిన విచారణ పూర్తి కాకముందే రోడ్డు నిర్మాణం పూర్తి చేసి, హెచ్ఎండిఏ అనుమతులు వస్తాయని ఆరోపణలు లేకపోలేదు..**

- మొదటి పేజి తరువాయి

దుండిగల్ మండలం బౌరంపేట్‌లో సుమారు 2017 నుండి, 40 ఫీట్ల రహదారి లేకపోవడంతో..! హెచ్ఎండిఏ అనుమతులు లభించక, పలువురు బిల్డర్‌లు చేతులెత్తేశారు.. చివరకి రెండు నిర్మాణ సంస్థలు, ఈ వెంచర్‌ను తీసుకుంది..! దీంతో సీఎంకి సన్నిహితుడిగా చెప్పుకునే కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఓ నాయకుడి నిర్వాకంతో, ప్రభుత్వ భూమిలో అక్రమ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.. ఈ తప్పుడు రోడ్డు నిర్మాణం విషయంపై, పత్రికల్లో వచ్చిన వార్తా కథనాల ద్వారా మేడ్చల్ జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్ళింది.. వెంటనే కలెక్టర్ మను చౌదరి, బుధవారం మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్‌ను విచారణకు ఆదేశించినట్లు అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, తెలిపారు.. ఈ రోడ్డు నిర్మాణం వ్యవహారంలో కీలకంగా సహకరించిన, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బందిపై వేటు పడే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.. అదే క్రమంలో సంబంధిత సిఫార్సుల నేత, సీఎం సన్నిహితుడు, బౌరంపేట్ వాసి, తమని కాపాడుతాడనే ధీమాతో ఉన్నట్టు కూడా ఆరోపిస్తున్నారు..


## ప్రభుత్వ భూమిని అమ్ముకున్నట్టేగా..?

సర్వే నెం. 166/1, 166/3 ప్రభుత్వ భూమి మీదుగా, 40 ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల్లో అధికారులు బరితెగింపుతో ప్రభుత్వ భూమిని విక్రయించారనే చెప్పాలి.. దీని వెనుక ఓ అధికార పార్టీ నాయకుని పలుకుబడి ఉన్నట్లు తెలుస్తోంది.. మరోవైపు అధికారులు అత్యుత్సాహంతో వ్యవహరించి, మున్సిపల్ యాక్ట్ 2019, సెక్షన్ 176 ప్రకారం టిడిఆర్ ఇస్తామని, రైతులకు జారీ చేసిన నోటీసుల్లో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ నాయక్ స్పష్టతను ఇచ్చినప్పటికీ.. ప్రశ్నించిన మీడియాకు మాత్రం తనకు ఏమి తెలియదని బుకాయించడం గమనార్హం.. బౌరంపేట్ సర్వే నెం. 166 ప్రభుత్వ భూమిలో 40 ఫీట్ల రోడ్డు వేస్తున్నారని, భూమిని కోల్పోతున్న రైతులు అడ్డుకున్నారు.. అయినప్పటికీ అక్రమార్కులతో కుదుర్చుకున్న ఒప్పందం కాబోలు.. ప్రభుత్వ భూమిలో అక్రమ రోడ్డు నిర్మాణానికి “టీడీఆర్” ఇప్పిస్తామని మున్సిపల్ కమిషనర్ బాధ్యతా రహితంగా చెప్పడం ఇప్పుడు సమస్యలు కొని తెచ్చుకున్నట్టు అయింది.. అధికారపార్టీ నాయకుడి మెప్పు పొందేందుకు, కమిషనర్, టిపిఎస్, ఈ విషయంలో హద్దుమీరి వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ కొందరు నేతల తీరునే.. ఈ ప్రభుత్వం లోనూ, ఈ అక్రమ రోడ్డు నిర్మాణానికి అధికారపార్టీ నాయకుడు తన హుకుంతో, పైఅధికారులకు తెలియకుండా మున్సిపల్, మండల స్థాయి అధికారులతో రూ.4 కోట్లకు బేరం కుదుర్చుకు నారని విమర్శలు వస్తున్నాయి..

## “డాలర్ మెడోస్” ఘటనే.. ఇక్కడ కూడా పునరావృతం..!

బౌరంపేట్ పరిధిలోని డిఆర్‌కే కళాశాల రోడ్డులోని డాలర్ మెడోస్ కాలనీకి హెచ్ఎండిఏ అనుమతులు లభించడం కోసం..!అప్పటి రైతుల నుండి పట్టా భమిని, తీసుకుని 12 ఫీట్ల రోడ్డును, 40 ఫీట్లు విస్తరించినట్లు బిల్డర్, చెబుతూ..! “డాలర్ మెడోస్ వెంచర్‌కి సుమారు 8 ఏళ్ళ క్రితం హెచ్ఎండిఏ అనుమతులు పొందారు.. తాజాగా బౌరంపేట్ డాలర్ మెడోస్ హెచ్ఎండిఏ వెంచర్ కథ అడ్డం తరిగింది.. నాడు 40 ఫీట్ల రోడ్డుకు తాము భూమి ఇవ్వలేదని, కేవలం 12 ఫీట్ల రోడ్డు ఉందని, రైతులు కాలనీ వాసులతో గొడవలు తలెత్తాయి.. ఈ వ్యవహారాన్ని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ డాలర్ మెడోస్ కాలనీకి వెళ్ళిన విషయం తెలిసిందే.. అయినప్పటికీ సర్వే నెం.166 ప్రభుత్వ భూమితో 40 ఫీట్ల రోడ్డు నిర్మాణం వేయడం అంటే భవిష్యత్తు సమస్యలకు కమిషనర్, తహశీల్దార్ పునాదులు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు..

















# చండీ యాగానికి హాజరైన రాజ్ కుమార్ రెడ్డి





- పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన అర్చక సంఘ ప్రతినిధులు, పురోహితులు
- పేటలో అర్చక సంఘ కార్యాలయ ఏర్పాటుకు 200 గజాల స్థలాన్ని కేటాయిస్తామన్న రాజ్ కుమార్ రెడ్డి
- హర్షధ్వానాలను వ్యక్తం చేసిన అర్చక సంఘ సభ్యులు, పురోహితులు

**ఎల్బీనగర్ పెన్ పవర్ జూలై 16:** ధూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ కాచిగూడలోని తూల్జాభవన్ లో బుధవారం నిర్వహించిన పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. రాజ్ కుమార్ రెడ్డికి అర్చక సంఘం ప్రతినిధులు, పురోహితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకుముందు నిర్వాహకులు రాజ్ కుమార్ రెడ్డిని శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన యాగానికి మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలాచారితో కలిసి రాజ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవచారి మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ధూప, దీప నైవేద్య అర్చక సంఘ సమావేశానికి రాజ్ కుమార్ రెడ్డి లక్ష రూపాయలను అందజేయడం అభినందనీయమని అన్నారు.

### పేటలో అర్చక సంఘ కార్యాలయానికి 200 గజాల స్థలం: రాజ్ కుమార్ రెడ్డి

నారాయణపేట జిల్లాలో ధూప, దీప నైవేద్య అర్చక సంఘ కార్యాలయ ఏర్పాటు కోసం 200 గజాల స్థలాన్ని కేటాయించనున్నట్లు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా హర్షధ్వానాలను వ్యక్తం చేశారు. ఇప్పటికే సంఘానికి లక్ష రూపాయలను అందజేయడం జరిగిందని తెలిపారు. అర్చక సంఘానికి స్థలాన్ని ప్రకటించిన రాజ్ కుమార్ రెడ్డిని వేణుగోపాలాచారి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో అర్చక సంఘం ప్రతినిధులు, వేణుగోపాలాచారితో కలిసి రాజ్ కుమార్ రెడ్డి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవశర్మ, నారాయణపేట జిల్లా అధ్యక్షులు జ్ఞానేశ్వర్, వందలాదిమంది అర్చక సంఘ సభ్యులు, పురోహితులు పాల్గొన్నారు.

## ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్.. దసరా నాటికి పూర్తి

- మొదటి పేజి తరువాయి

ఈ విషయంలో ఎవరినీ తప్పు పట్టాల్సిన అవసరం లేద న్నారు. తొలుత నిర్మాణ పనులు చేపట్టిన గాయత్రీ సంస్థ తప్పుకోవడంతో పనులను మరో సంస్థకు అప్పగించామన్నారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి దసరా నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

## పీచు మిఠాయి అమ్మేటోళ్లతో జాగ్రత్త.. వీళ్లు అమ్మే చాక్లెట్లు పిల్లలు తింటే ఇక అంతే !

**హైదరాబాద్ పెన్ పవర్:**పీచు మిఠాయి అంటే పిల్లలు ఎంతగా ఇష్టపడతారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పిల్లలేంటి పెద్దలు కూడా ఈ స్వీట్ ను ఇష్టపడుతుంటారు. పింక్ రంగులో లేదా మరో ఆకర్షణీయమైన కలర్ లో ఉండే ఈ మిఠాయి కనిపిస్తే వదలకుండా కొని తినటం చూస్తుంటాం. అయితే పీచు మిఠాయి అమ్మే వాళ్లతో జాగ్రత్తగా ఉండకపోతే.. పిల్లలు చాలా డేంజర్ జోన్ లో పడిపోయే ప్రమాదం ఉంది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో పీచుమిఠాయి అమ్మే వ్యక్తి దగ్గర గంజాయి చాక్లెట్లు కనిపించడం కలకలం రేపింది. ఒకవైపు మిఠాయి విక్రయిస్తూనే మరోవైపు రహస్యంగా.. గుట్టుచప్పుడు కాకుండా గంజాయి చాక్లెట్లు అమ్ముతుండటం చూసి స్థానికులు షాక్ కు గురయ్యారు. స్థానికుల సమాచారంతో ఆ వ్యక్తి పీచు మిఠాయితోపాటు గంజాయి చాక్లెట్లను అమ్ముతున్నట్టులు నిర్ధారించారు పోలీసులు. గంజాయి చాక్లెట్లను అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. చాక్లెట్లు ఎక్కడినుండి తీసుకువచ్చాడనే కోణంలో ఆరా తీస్తున్నారు. యూపీ కి చెందిన వ్యక్తిగా గుర్తించిన పోలీసులు.. పక్కా సమాచారంతో వ్యక్తిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పీచు మిఠాయి అమ్మే వ్యక్తి నుంచి గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీని వెనుక ఎవరున్నారు.. పెద్ద రాకెట్ ఏమైనా నడుస్తుందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## హైదరాబాద్ ఎల్బీనగర్ మైనర్‌పై లైంగిక దాడి.. పోక్సో కేసులో వ్యక్తికి జీవిత ఖైదు..



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ ఎల్బీనగర్ లో సంచలనం సృష్టించిన మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో రమేష్ అనే వ్యక్తికి జీవితఖైదు విదించింది కోర్టు. పోక్సో చట్టం ప్రకారం బుధవారం (జులై 16) ఆంబోతు రమేష్ అనే వ్యక్తికి జీవిత ఖైదు విధించింది. అదే విధంగా రూ. 25,000/- జరిమానా విధించింది. లైంగిక దాడి బాధితురాలికి రూ.10 లక్షలు పరిహారం మంజూరు చేసింది ఎల్ నగర్ ఫాస్ట్ ట్రాక్ బీ కోర్టు.

ఎల్బీనగర్ లో మంగళవారం (జులై 15) కూడా పోక్సో కేసులో ఒక వ్యక్తికి జీవిత ఖైదు విధించిన విషయం తెలిసిందే. మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి, పలుమార్లు అత్యాచారం చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన వ్యక్తికి ఎల్బీనగర్ స్పెషల్ పోక్సో కోర్టు జీవితఖైదు విధించింది. పోలీసులు, పీపీ తెలిపిన ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వెంకటాద్రి పాలెంకు చెందిన శివరాత్రి మల్లేశ్(40) మీర్ పేట పరిధిలోని అల్మాస్ గూడలో నివాసం ఉంటూ డైలీ లేబర్ గా పనిచేస్తున్నాడు. 2019లో స్థానికంగా ఉండే ఓ బాలికకు మాయమాటలు చెప్పి, శారీరకంగా లొంగతీసుకున్నాడు. ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలిక గర్భవతి అయిన తర్వాత ఆమె ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆత్మహత్యకు పాల్పడింది. మల్లేశ్ పై అనుమానం వ్యక్తం చేస్తూ మీర్ పేట పోలీసులకు బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తి ఆధారాలతో ఎల్బీనగర్ లోని స్పెషల్ పోక్సో కోర్టులో చార్జ్ షీట్ ఫైల్ చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన కోర్టు మల్లేశ్?ను నేరస్తుడిగా తేల్చి, సోమవారం జీవిత ఖైదు విధించింది. బాధితురాలి తండ్రికి రూ.2 లక్షల పరిహారం ప్రభుత్వం అందించాలని ఆదేశించింది

## లంచం తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికిన ఈఎన్‌సీ కనకరత్నం




**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో యాంటి కరప్షన్ బ్యూరో (ఏసీబీ) దూకుడు పెంచింది. అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతోంది. లంచం తీసుకోవాలంటేనే అధికారులు జంకేలా చేస్తోంది. ఈ క్రమంలో ఏసీబీకి మరో అవినీతి అధికారి అడ్డంగా దొరికాడు. బుధవారం (జూలై 16) హైదరాబాద్ ఎర్రమంజిల్?లోని పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేసింది. లంచం తీసుకుంటూ ఈఎన్సీ కనకరత్నం ఏసీబీ వలకు చిక్కాడు.

డీఈ బదిలీ కోసం రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. ఈ మేరకు ఈఎన్సీ కనకరత్నంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. కాగా, పంచాయతీ రాజ్ శాఖలో ఈఎన్సీ హోదాలో కొన్ని రోజుల క్రితమే పదవి విరమణ చేశారు కనకరత్నం. ఏడాది పాటు కనకరత్నం పదవిని పొడగించింది ప్రభుత్వం. కాళేశ్వరంతోపాటు ఇతర ప్రాజెక్టుల నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఇరిగేషన్?మాజీ ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) మురళీధర్‌రావును కూడా ఏసీబీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు ఆయన్ను మంగళవారం (జూలై 15) ఉదయం అదుపులోకి తీసుకున్నారు. మురళీధర్‌రావుతో పాటు ఆయన బంధువుల ఇండ్లలో అధికారులు సోదాలు నిర్వహించారు. మురళీధర్ రావుగా భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు అధికారులు గుర్తించారు. మురళీధర్ రావు ఆస్తుల విలువ మార్కెట్ వాల్యూ ప్రకారం దాదాపు రూ.150 కోట్ల వరకు ఉంటాయని అంచనా.

## ఆదిలాబాద్ లో నిరుద్యోగులను నిండా ముంచిన మైక్రో ఫైనాన్స్.. రోడ్డున పడ్డ 500 మంది బాధితులు





**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదిలాబాద్ లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులే టార్గెట్ గా మోసాలకు పాల్పడింది ఓ సంస్థ. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు కాజేసింది. డబ్బులు తీసుకుని మోహం చాటేయడంతో బాధితులో ఆందోళనకు దిగారు.

ఆదిలాబాద్ జిల్లాలో డిజిటల్ మైక్రో ఫైనాన్స్ నిరుద్యోగులను నిండా ముంచింది. ఉద్యోగాలు ఇస్తామంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారు సంస్థ నిర్వాహకులు. ఒక్కోక్కరి నుంచి రూ.20 వేలు వసూలు చేసింది యాజమాన్యం. ఇలా 500 మంది నుంచి డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసింది యాజమాన్యం. డబ్బులు తీసుకుని ఉద్యోగాలివ్వకుండా బోర్డు తిప్పేయడంతో బాధితులు సంస్థ ముందు ఆందోళనకు దిగారు.

తమకు న్యాయం చేయాలని డబ్బులు తిరిగి ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు. మరోసారి ఇలాంటి మోసాలకు పాల్పడకుండా సంస్థ నిర్వాహకులకు కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఈపీఎఫ్, SIP పెట్టుబడులతో రూ.10 కోట్లు కూడబెట్టొచ్చా..? ఎన్ని ఏళ్లు పడుతుంది..?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఒక వ్యక్తి తన రిటైర్మెంట్ అలాగే ఇద్దరు పిల్లల చదువు కోసం రూ.10 కోట్లు కూడబెట్టాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే ఇందుకోసం ప్రతినెల మ్యూచువల్ ఫండ్ ఎస్ఐపీ ద్వారా రూ.62వేలు ఇన్వెస్ట్ చేస్తుండగా.. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ లో నెలకు రూ.34వేలు సేవ్ చేస్తున్నాడు. అయితే ఈ ప్లాన్ తనను 15 ఏళ్లలో రూ.10 కోట్లు కూడబెట్టేందుకు దోహదపడుతుందా అనే అయోమయంలో ఉన్నాడు. దీనికి తోడు కొద్దిగా ఈక్విటీ పెట్టుబడులు కూడా కలిగి ఉన్నట్లు చెప్పాడు. అయితే దీనిపై ఆర్థిక నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. సదరు వ్యక్తి ప్రస్తుతం పొదుపు చేస్తున్న ప్రణాళికను కొనసాగిస్తే రానున్న 15 ఏళ్ల తర్వాత రూ.6 కోట్ల వరకు కూడబెట్టవచ్చని మెవెల్త్ గ్రో.కామ్ సహ వ్యవస్థాపకులు హర్షద్ చేతన్వాలా అంచనా వేస్తున్నారు. ఇక్కడ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులపై సగటు రాబడిని 12 శాతంగా పరిగణించగా.. ఈపీఎఫ్ పెట్టుబడులపై 7 శాతం రాబడిని లెక్కించటానికి తీసుకున్నారు.

%ూూూూ =జూూణ% : మీరు వేసే పన్నులు, ఒప్పందాల్లో మా రైతులను వదిలేయండి : అమెరికాకు ఇండియా రిక్వెస్ట్

అయితే సదరు వ్యక్తి కోరుకున్న రూ.10 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవటానికి అదనంగా పెట్టుబడి మొత్తాన్ని పెంచాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకోసం దీర్ఘకాల్లో మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను పెంచుతూ స్టెప్ అప్ చేయాలని అలాగే ప్రస్తుతం ఉన్న స్మాల్ అండ్ మిడ్

క్యాప్ స్కీమ్ తో పాటు లార్జ్ క్యాప్ లేదా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ తమ పెట్టుబడి పోర్ట్ ఫోలియోలో కొత్తగా చేర్చుకోవటం రిస్కును తగ్గిస్తుందని అంటున్నారు. మార్కెట్ల పనితీరు ఆందోళనలను పక్కన పెట్టి తమ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్రణాళికలను నిరంతరాయంగా కొనసాగించటంలోనే విజయం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

# వేరు కాపురం ఉందామంటూ భార్య ఒత్తిడి .. పెళ్ళయ్యి ఏడాది కాకముందే... భర్త ఆత్మహత్య..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల కాలంలో వివాహబంధంపై నమ్మకం సన్నగిల్లేలా వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కారణాలేమైనా కానీ.. ఎక్కువ సందర్భాల్లో బలవుతోంది భర్తలే... వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనో, ఇష్టం లేని పెళ్లి చేసారనో, ఆస్థి కోసమో.. ఇలా కారణం ఏదైనా కానీ.. భర్తలను చంపడానికి ఏ మాత్రం వెనుకాడటంలేదు నేటి మహిళలు. ఏపీలోని తాడేపల్లిలో భర్య వేధింపులు తాళలేక మరో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్న బాధితుడు తన చావుకు భార్య వేధింపులే కారణమని పేర్కొన్నాడు. బుధవారం ( జులై 16 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. తాడేపల్లి మండలం నులకపేటకు చెందిన బ్రహ్మయ్యకు మంగళగిరికి చెందిన మోహన కౌసల్యకు గత ఏడాది ఆగస్టు 18న వివాహం అయ్యింది. బ్రహ్మయ్య తల్లిదండ్రులతో కలిసి ఉన్నారు నవదంపతులు. ఈ క్రమంలో వేరు కాపురం ఉందామంటూ భర్తపై ఒత్తిడి తెచ్చింది భార్య మోహన కౌసల్య. దీంతో ఉండవల్లిలోని సాయిబాబా గుడి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం పెట్టారు బ్రహ్మయ్య దంపతులు. ఆషాడ మాసం కావడంతో పుట్టింటికి వెళ్ళింది భార్య కౌసల్య.ఏం జరిగిందో కానీ.. ఉదయం ఉండవల్లిలో తాను నివాసం ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు బ్రహ్మయ్య. సెల్ఫీ వీడియో తీసుకుంటూ తన చావుకు భార్యే కారణమని వీడియో పేర్కొన్నాడు బ్రహ్మయ్య. తమ కొడుకు చావుకు కోడలే కారణమని ఆరోపిస్తున్నా రు బ్రహ్మయ్య తల్లిదండ్రులు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు తల్లిదండ్రులు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు తాడేపల్లి పోలీసులు.

# లోన్ మొత్తం కట్టేసినా మీ క్రెడిట్ రిపోర్ట్ అప్‌డేట్ కాలేదా..? అయితే ఇలా చేయండి




**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుత కాలంలో రుణాన్ని తీసుకోవటం ఎంత అత్యవసరంగా మారిదో దానిని చెల్లించటం కూడా అంతే ముఖ్యం. ఇది నెలవారీ చేతికి వచ్చే మొత్తాన్ని పెంచటంతో పాటు రుణాల భారాన్ని తగ్గిస్తుంది. అలాగే మీరు బాధ్యతాయుతంగా రుణాల పట్ల ప్రవర్తిస్తున్నట్లు సంకేతాలను ఆర్థిక సంస్థలకు తెలియజేస్తుంది. అయితే రుణాన్ని చెల్లించాక కూడా అది యాక్టివ్ స్టేషన్ లో ఉన్నట్లు క్రెడిట్ రిపోర్టుల్లో కనిపిస్తే దానిని వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టడం చాలా ముఖ్యం. ఇది మీ క్రెడిట్ వర్థినెస్ కు ప్రమాదాన్ని కలిగించవచ్చు.సాధారణంగా రుణ సంస్థలు ప్రతి 30 నుంచి 60 రోజుల మధ్య క్రెడిట్ బ్యూరో సంస్థలకు రుణాలకు సంబంధించిన డేటాను అందిస్తుంటాయి. మీ లోన్ క్లోజ్ అయితే ఆ వివరాలు క్రెడిట్ బ్యూరో సంస్థలకు అందగానే వారు అప్ డేట్ చేస్తారు. అప్పటి వరకు రుణం యాక్టివ్ స్టేటస్ లోనే ఉంటుంది. అయితే ఇందులో ఆలస్యం జరిగితే మీరు ఎక్కువ క్రెడిట్ యుటిలైజేషన్ కలిగి ఉండటం సిబిల్ రిపోర్టును దెబ్బతీయవచ్చు.ఇలాంటి సందర్భాల్లో ముందుగా మీరు రుణాన్ని అందించిన సంస్థను సంప్రదించటం ఉత్తమం. వారి నుంచి మీ లోన్ క్లోజ్ అయినట్లు పరిశీలించుకుని.. దానికి సంబంధించిన ఎన్‌ఓసీ సర్టిఫికెట్ పొందండి. ఆ తర్వాత దీనిని క్రెడిట్ బ్యూరో సంస్థలకు అందించి సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఇందుకోసం క్రెడిట్ బ్యూరో సంస్థ అధికారిక వెబ్ పోర్టల్ లో సమస్య పరిష్కారాన్ని ఎంచుకుని తగిన డాక్యుమెంట్లను అప్ లోడ్ చేస్తే సరిపోతుంది. సాధారణంగా మూడు వారాల్లోపు ఈ సమస్యను వారు పరిష్కరిస్తారు.ఒక్కసారి క్రెడిట్ బ్యూరో సంస్థ రుణ చెల్లింపును నిర్థారించుకున్నాక దానిని అప్ డేట్ చేస్తుంది. దీంతో మీ సిబిల్ స్కోర్ లేదా క్రెడిట్ స్కోర్ బూస్ట్ అవుతుంది. అలాగే నెలకు ఒకసారి మీ సిబిల్ రిపోర్టులు చెక్ చేసుకోవటం ద్వారా ఇలాంటి తప్పిదాలను ఎప్పటికప్పుడు చూసుకునేందుకు వీలుంటుంది. ఒక వేళ సమస్యను క్రెడిట్ బ్యూరో సంస్థ సరిచేయకపోతే మీరు రిజర్వు బ్యాంక్ ద్వారా బ్యాంకింగ్ అంబర్డ్స్మెన్ ను సంప్రదించవచ్చు. ఇలా సకాలంలో స్పందించటం వల్ల మీ సిబిల్ స్కోర్ సరిచేయబడి భవిష్యత్తులో రుణాలు పొందటం సులభతరం అవుతుంది. మంచి చెల్లింపుల క్రెడిట్ హిస్టరీ ఉంటే మీకు ఆర్థిక సంస్థల నుంచి క్రెడిట్ కార్డ్ ఆఫర్లతో పాటు తక్కువ వడ్డీ రేట్లకే రుణాలు అందుతాయి. అలాగే రుణాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవటం, ఉన్న రుణాల చెల్లింపులను సకాలంలో చేయటం వల్ల వ్యక్తుల క్రెడిట్ స్కోర్ పెరుగుతుందని గుర్తుంచుకోండి.

# వర్షంలో సీఎం మూడు కిలోమీటర్ల ర్యాలీ.. బీజేపీ పాలిత రాష్ట్రాల తీరుపై దీదీ లాంగ్ మార్చ్..



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆమె ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి.. కనుసైగ చేస్తే అధికార యంత్రాంగం మోకరిల్లుతుంది. అయినప్పటికీ సాధారణ పౌరుల వలె.. మూడు కిలోమీటర్లు నడిచింది. ఒక వైపు వర్షం కురుస్తున్నా.. ఎలాంటి గొడుగు లేకుండా.. అందరిలాగే తడుస్తూ ఒకటి కాదు రెండు కాదు.. మూడు కిలోమీటర్ల ర్యాలీలో ప్రజలతో పాటు నడిచింది. వేల సంఖ్యలో వచ్చిన జనాలకు మార్గదర్శకం చేస్తూ లాంగ్ మార్చ్ చేయడం దేశ రాజకీయ నాయకుల దృష్టిని ఆకర్షించేలా చేసింది. ఏది చేసినా సంచలనంగా ఉండే వెస్ట్ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ మరోసారి వార్తల్లో నిలిచింది. దేశ వ్యాప్తంగా బెంగాలీ ప్రజలను బీజేపీ క్రమక్రమంగా టార్గెట్ చేస్తోందని.. టార్చర్ చేస్తోందని విమర్శిస్తూ మమతాబెనర్జీ బుధవారం (జులై 16) భారీ ర్యాలీ నిర్వహించడం సంచలనంగా మారింది. బెంగాలీలపై దాడులు ఇలాగే కొనసాగితే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కోల్ కతాలో నిర్వహించిన ఈ ర్యాలీలో తృణమూల్ కాంగ్రెస్ నేతలందరూ పాల్గొన్నారు. మొత్తం 15 వందల మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మూడు కిలోమీటర్ల ర్యాలీలో వర్షంలో తడుస్తూ.. పవర్ ఫుల్ స్పీచ్ ఇచ్చారు దీదీ. %దీజీ% పాలిత రాష్ట్రాలలో బెంగాలీ మాట్లాడే ప్రజలను టార్గెట్ చేసి పంపించాలని కేంద్రం సీక్రెట్ నోటీసులు జారీ చేసినట్లు ఆమె ఆరోపించారు. బెంగాలీ ప్రజలను ఆయా రాష్ట్రాల నుంచి ఎలా పంపిస్తారు.. దీనికి త గిన మూల్యం చెల్లిస్తారని కోల్ కతాలో నిర్వహించిన ర్యాలీలో విమర్శించారు. నేను బెంగాలీ మళ్లీ మళ్లీ మాట్లాడతాను.. దమ్ముంటే నన్ను కూడా జైల్లో పెట్టండి.. అని ఛాలెంజ్ విసిరారు.

వెస్ట్ బెంగాల్ లో ఓటర్ లిస్ట్ రివిజన్ చేయాలని ఎలక్షన్ కమిషన్ సమాయత్తమవుతున్న తరుణంలో.. దీదీ విమర్శలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఓటర్ లిస్టుల్లో పేరు లేదనీ.. మళ్లీ నమోదు చేసుకోవాలని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలని ఎన్నికల కమిషన్ చూస్తోందని.. బీజేపీ చేతిలో పావులా మారిందని విమర్శించారు.

ఇటీవల ఒడిశా, ఢిల్లీలో బెంగాలీలపై భాష పేరుతో దాడులు జరగటం.. స్వరాష్ట్రాలకు పంపించడం మొదలైన ఘటనలు దీదీ ఆగ్రహానికి కారణమయ్యాయి. ఒడిశాలో ఇటీవల 444 మందిని బంగ్లాదేశీయులుగా అనుమానిస్తూ అదుపులోకి తీసుకున్నారు. అయితే అందులో 200 మంది వెస్ట్ బెంగాల్ పౌరులు ఉన్నారని.. బంగ్లాదేశీయుల నెపంతో బెంగాలీలను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. బెంగాల్ పౌరులకు ఐడీ కార్డ్స్ ఉన్నాయి.. వారు చాలా రాష్ట్రాల్లో పని చేస్తున్నారు. వారికి స్కిల్స్ ఉన్నాయి కాబట్టి ఎక్కడైనా పనిచేస్తారు.. పనిచేయించుకుంటారు.. బెంగాలీలో మాట్లాడితే అరెస్ట్ చేస్తారు.. మీకు ఎవరిచ్చారు ఆ హక్కు.. బెంగాల్ భారత్ లో భాగం కాదా.. అని నిలదీశారు దీదీ.

**ప్రధాని మోదీ పర్యటనకు ఒకరోజు ముందు:**

ప్రధాని నరేంద్ర మోదీ వెస్ట్ బెంగాల్ పర్యటనకు వస్తున్న ఒక రోజు ముందు సీఎం మమతా బెనర్జీ ఇంత భారీ ర్యాలీ నిర్వహించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచి గ్రౌండ్ లెవల్ లో రూట్ సిద్ధం చేసుకుంటున్నారని అంటున్నారు. వీధుల్లో ధర్నాలు చేసి.. సామాన్యులను ఆకట్టుకోవడం.. మమతాబెనర్జీ స్టైల్. ప్రతిపక్షాలకు, కేంద్రానికి చెప్పాల్సిన విషయం సూటిగా చెప్పేందుకు.. ఢీ అంటే ఢీ అంటూ ఆమె వీధి పోరాటాలకు వెళ్తుంటారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె వీధి పోరాటాలు చాలా ప్రభావం చూపాయి. మరోసారి బెంగాలీ ఆత్మగౌరవ పోరాటం పేరుతో ఆమె రోడ్డెక్కడం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునేనని విశ్లేషకులు అంటున్నారు.

# చందు నాయక్ హత్య కేసు: FIR లో తొమ్మిది మంది నిందితులు.. కాల్పులు జరిపింది ఎవరంటే.?

హైదరాబాద్ లో సంచలనం సృష్టించిన సీపీఐ నేత చందు నాయక్ హత్య కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు మొత్తం తొమ్మిది మంది పేర్లను %ఖీ×=% లో చేర్చారు. ప్రధాన నిందితుడు రాజేశ్ తో పాటు ప్రశాంత్, ఏడుకొండలు, సుధాకర్, మున్నా, రాయుడు, రవీంద్రా చారి, యాదిరెడ్డి లు నిందితులుగా చేర్చారు పోలీసులు. కాల్పులు జరిపింది నలుగురు అయితే..వారికి సహకరించింది మరో ఐదుగురిగా పోలీసులు గుర్తించారు. మున్నా, రాయుడు, యాదిరెడ్డి, బాషాను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు పోలీసులు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు వాడిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితులు కోసం ప్రత్యేకంగా పది టీమ్‌లతో గాలిస్తున్నారు పోలీసులు. కాల్పులు జరిపిన నలుగురు రాజేష్, సుధాకర్, శివ,బాషా గా గుర్తించిన పోలీసులు..భూ తగాదాల వల్లే చందు నాయక్ ను కాల్చినట్లు తేల్చారు పోలీసులు. కాల్పులకు కుంట్లూర్ లోని భూ తగాదాలే కారణమని చెప్పారు.నిందితులు చౌటుప్పల్ వైపు పారిపోయినట్టు సీసీ కెమెరాల్లో గుర్తించారు . నిందితులను పట్టుకోవడానికి పది టీంలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు పోలీసులు. గత కొద్ది రోజుల నుంచి రాజేశ్ కి చందు నాయక్ కి మధ్య విభేదాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. కుంట్లూరులోని రావి నారాయణరెడ్డి నగర్ లో చందు నాయక్ అనుచరులు గుడిసెలు వేయడంతో రాజేశ్ కక్ష పెంచుకుని ఈ హత్య చేసినట్లు చెబుతున్నారు. సీపీఐ పార్టీలో ప్రస్తుతం




కౌన్సిల్ నెంబర్ గా ఉన్న చందు నాయక్ తో కలిసి తిరిగిన రాజేష్ ఈ దారుణానికి పాల్పడ్డాడని నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులు పోలీసులను కోరారు.

జులై 15న ఉదయం మలక్ పేటలోని పార్క్ ముందు చందు నాయక్ ను దుండగులు కాల్చి చంపిన సంగతి తెలిసిందే. పక్కా ప్లాన్ ప్రకారమే ఏడు రౌండ్లు కాల్పులు జరిపి హతమార్చారు.

## శ్రీశైలం జలాశయంలో తెప్పల్లోనే కొట్టుకున్న మత్స్యకారులు : సినిమా సీన్ చూపించిన కుర్రోళ్లు



**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీశైలం జాలాశయం.. వరద నీళ్లు రావటంతో చేపల వేట షురూ చేశారు మత్స్యకారులు. అందరూ కుర్రోళ్లే. తెప్పలపై చేపల వేట చేస్తున్న వీళ్ల మధ్య మాటమాట పెరిగింది. ఇది కాస్తా కొట్లాటకు దారి తీసింది. నిండు జలాశయంలో ఉన్నాం.. నీళ్లు ఫుల్ గా ఉన్నాయనే భయం లేదు.. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.. తెప్పల పైనుంచి దూకుతూ.. సినిమా సీన్ తలపించే విధంగా కొట్టుకున్నారు. మొత్తం నాలుగు తెప్పల్లో ఉన్న కుర్ర మత్స్యకారులు.. ఒకరిపై ఒకరు కర్రలు, తెడ్డు కర్రలతో దాడులు చేసుకుంటూ నది మధ్యలో బీభత్సం చేశారు. లింగాలగట్టు సమీపంలో జరిగిన ఈ ఘటన వీడియో వైరల్ కావటంతో పోలీసులు కేసులు పెట్టారు.

శ్రీశైలం మండలం లింగాలగట్టు జలాశయంలో మత్స్యకారుల మధ్య ఘర్షణ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జలాశయం ముందు భాగంలో చేపలను పట్టే విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం మొదలైంది. ఇది కాస్తా దాడుల వరకు వెళ్లింది. తెప్పలపై చేపల వేట సాగిస్తున్న సమయంలో.. నది మధ్యలోనే.. తెప్పలు దూకుతూ.. తెడ్లు కర్రలతో దాడులు చేసుకున్నారు.. కొట్టుకున్నారు. ఈ దాడుల్లో కొందరు మత్స్యకారులు గాయపడ్డారు. శ్రీశైలం గేట్లు మూసివేయటంతో.. జలాశయం దగ్గర చేపలు పట్టే సమయంలో ఈ ఘటన జరిగింది.

శ్రీశైలం డ్యామ్ గేట్లు ఎత్తడంతోపాటు.. కృష్ణా నదిపై రెండు నెలలు చేపల వేటపై నిషేధం ఉంది. నిషఏధం సమయంలోనే లింగాలగట్టు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లటం.. దాడులు చేసుకోవడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. ఈ ఘటనపై సుండిపెంట సీఐ చంద్రబాబును వివరణ కోరగా.. వారు అంతా బంధువులే అని.. చిన్న చేప కోసం ఆవేశంలో ఒకరినొకరు తిట్టుకోవడం, కొట్టుకోవటం జరిగిందని అందరినీ పిలిపించి బైండోవర్ కేసు నమోదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు సీఐ చంద్రబాబు.

## చందు రాథోడ్ ను హత్య చేసింది అందుకేనా? వెలుగు చూసిన కొత్త కోణం




**హైదరాబాద్ పెన్ పవర్:** మలక్ పేట్ లో జరిగిన చందు రాథోడ్ హత్య కేసులో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. నిన్న మలక్ పేట్ లోని శాలివాహన నగర్ లోని పార్కులో వాకింగ్ చేస్తుండగా దుండగులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. చందూరాథోడ్ అక్కడిక్కడే మరణించారు. మొత్తం ఎనిమిది రౌండ్లు కాల్పులు జరిపారు. అందులో ఐదు బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చంపాలన్న స్కెచ్ వేసి మరీ దుండగులు కాల్పులు జరిపారు. అయితే భూ వివాదాలుకూడా ఒక కారణం కాగా, మరొక కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

### భూమిని కాజేశారంటూ...

చందు రాథోడ్ వారి స్థలంలో సీపీఎం నేతగా పేదల చేత గుడెసెలు వేయించి తమ ఆస్తిని కాజేసే ప్రయత్నం చేశారన్న కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చందు రాథోడ్ హత్య కేసులో మొత్తం ఐదుగురు నిందితులు పాల్గొన్నారు. వీరంతా రెండు రోజుల పాటు రెక్కీ నిర్వహించారు. కారును అద్దెకు తీసుకుని చందు రాథోడ్ నివాసం వద్ద రెండు రోజుల పాటు మకాం వేశారు. చందు రాథోడ్ రోజు వారీ కార్యక్రమాలను గురించి పక్కాగా తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఉదయం వాకింగ్ కు చందు రాథోడ్ వెళతారని నిందితులు గమనించారు.

### పక్కా ప్లాన్ వేసి...

శాలివాహన పార్కు వద్ద కాల్పులు జరిపి తాము ఎలా పరారు అవ్వాలన్న దానిపై కూడా ముందుగానే ప్లాన్ వేశారు. రెండు రోజుల పాటు అక్కడే ఉండి

చందు రాథోడ్ కార్యక్రమాలను పరిశీలించిన తర్వాత మాత్రమే పక్కా ప్లాన్ తో దాడి చేసి కాల్పులు జరిపినట్లు పోలీసుల విచారణలో ప్రాధమికంగా వెల్లడయింది. దీంతో పాటు చందు రాథోడ్ కు సంబంధించిన మరో కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు కేవలం భూ తగాదాల వల్లనే హత్య చేశారా? వివాహేతర సంబంధం ఇందులో ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు కాల్పుల కేసును సవాల్ గా తీసుకుని విచారణ చేపడుతున్నారు

# వరద జలాలకు శాస్త్రీయ గుర్తింపే లేదు : బనకచర్ల గైడ్ లైన్స్ కు విరుద్ధమన్న వెదిరె శ్రీరామ్





**హైదరాబాద్ పెన్ పవర్:**వరద జలాల ఆధారంగా ఏపీ చేపడుతున్న పోలవరం%-%బనకచర్ల లింక్? ప్రాజెక్ట్.. ట్రిబ్యునల్? అవార్డు, సీడబ్ల్యూసీ గైడ్?లైన్స్?కు పూర్తి విరుద్ధమని వెదిరె శ్రీరామ్?తెలిపారు. వరద జలాలకు శాస్త్రీయమైన గుర్తింపే లేదని చెప్పారు. వరద జలాలనే మాట ఊహాజనితమని తెలిపారు. 50 శాతం డిపెండబిలిటీ ఆధారంగా ఎగువ రాష్ట్రాలు ప్రాజెక్టులను కడితే.. దిగువ రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. అలాగే, దిగువ రాష్ట్రాలూ 50 శాతం డిపెండబిలిటీ కింద ప్రాజెక్టులను నిర్మిస్తే.. ఎగువన రాష్ట్రాలకూ నష్టం జరుగుతుందని చెప్పారు. ఇంకా చెప్పాలంటే మొత్తం బేసిన్‌లోని రాష్ట్రాలన్నింటికీ నష్టం జరుగుతుందన్నారు. బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు తీవ్ర నష్టమని పేర్కొన్నారు. ఏపీ ఆ ప్రాజెక్టు చేపడితే బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గోదావరి జలాల్లో తెలంగాణకు 968 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయని గుర్తుచేశారు. ఎస్సారెస్పీ సహా పలు ప్రాజెక్టులు పూడికతో నిండిపోవడం, మరోవైపు కాళేశ్వరం, దేవాదుల, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ తదితర ప్రాజెక్టులను నిర్మాణ దశలో ఉండడంతో.. ఇప్పటికీ పూర్తిస్థాయిలో కేటాయింపుల మేరకు జలాలను వినియోగించుకోవడం లేదని అన్నారు. ప్రస్తుతం ఏపీ జీబీ లింక్ ప్రాజెక్టును చేపడితే తెలంగాణ ప్రాజెక్టులకు నీళ్లు లేకుండా పోతాయని, నీటి వినియోగానికి ఇబ్బందులు ఏర్పడుతాయని చెప్పారు. ఆపరేషన్ ప్రొటోకాల్ మార్పులు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు ఇదే పరిస్థితి ఏర్పడుతుందని వెల్లడించారు. కేటాయింపుల మేరకు అన్ని రాష్ట్రాలు తమ నీటివాటాలను వినియోగించుకున్న తర్వాతే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉంటుందని వివరించారు. ఆ మిగులు జలాల్లోనూ బేసిన్ రాష్ట్రాలకు వాటా ఉంటుందని తెలిపారు.గోదావరి బేసిన్, సబ్ బేసిన్లవారీగా, ట్రిబ్యునల్ అవార్డులు, రాష్ట్రాలకు చేసిన నికర కేటాయింపులు తదితర అంశాలపై పవర్?పాయింట్? ప్రజెంటేషన్? ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు.. గోదావరి బేసిన్? రాష్ట్రాలతోపాటు ఏపీకి గుదిబండగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటిదాకా ఉన్న ట్రిబ్యునల్? అవార్డులతో పోలిస్తే గోదావరి ట్రిబ్యునల్? అవార్డు పూర్తిగా భిన్నమైందని చెప్పారు. మహారాష్ట్ర, కర్నాటక, ఉమ్మడి ఏపీ, ఉమ్మడి మధ్యప్రదేశ్?, ఒడిశా చేసుకున్న ఒప్పందాలనే ట్రిబ్యునల్ అవార్డుగా బచావ త్? ట్రిబ్యునల్? కేటాయించిందని తెలిపారు. అందులో భాగంగానే గోదావరిని 12 సబ్? బేసిన్లుగా విభజించారని వివరించారు.

# మీరు వేసే పన్నులు, ఒప్పందాల్లో మా రైతులను వదిలేయండి : అమెరికాకు ఇండియా రిక్వెస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత బృందం కొన్ని వారాలుగా చర్చలు కొనసాగిస్తూనే ఉంది. అయితే అమెరికా అడుగుతున్నదానికి ఇండియా అంగీకరించకపోవటం ఈ చర్చలను సుదీర్ఘంగా సాగదీస్తున్నాయి. అయితే మరోపక్క అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ మాత్రం అదిగో డీల్ అయిపోవచ్చింది.. ఇదిగో ఇండియా తమ డిమాండ్లకు అంగీకరించబోతోందంటూ మీడియాలో కామెంట్స్ చేస్తూనే ఉన్నారు. అయితే ట్రంప్ చెబుతున్న దానికి వాస్తవ పరిస్థితులకు మధ్య కొంత వ్యత్యాసం ఉంది.

అయితే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై రైతు సంఘాల్లో కూడా ఆందోళనలు పెరుగుతున్నాయి. తాజాగా భారత రైతు ఉద్యమాల సమన్వయ కమిటీ కేంద్ర మంత్రి పియూష్ గోయల్ కు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల్లో వ్యవసాయ ఉత్పత్తులను పక్కనపెట్టాలని కోరింది. భారతీయ రైతుల ప్రయోజనాలకు హాని కలిగించే షరతులు, ఒప్పందాలను నిలిపివేయాలని భారత ప్రభుత్వానికి సూచించింది. ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో జీవశక్తిని కాపాడాలని కోరింది.అమెరికా అగ్రి, డెయిరీ ఉత్పత్తులను భారతదేశంలోకి పన్నులు లేకుండా అనుమతించటం చాలా ప్రమాదకరమని రైతు సంఘం హెచ్చరించింది. ఇప్పటికే అమెరికా ఇండియా మధ్య డీల్ కోసం ఐదవ దఫా చర్చలు జరుగుతుండగా అమెరికా తమ అగ్రి ఉత్పత్తులను అనుమతించాలని కోరుతుండగా భారత్ మాత్రం నిర్మొహమాటంగా నిరాకరిస్తూనే ఉన్న సంగతి తెలిసిందే.

ప్రధానంగా అమెరికా చైనా, మెక్సికో, కెనడాలతో 2018 నుంచి వాణిజ్య యుద్ధాన్ని కొనసాగించటంతో యూఎస్ అగ్రి ఉత్పత్తుల ఎగుమతులు భారీగా దెబ్బతిన్నాయి. అయితే వీటిని ఇండియా వంటి అధిక జనాభా కలిగిన దేశాలకు రీరూట్ చేయాలని యూఎస్ ప్లాన్ చేస్తోందని నిపుణులు చెబుతున్నారు. అయితే అమెరికాలో ప్రభుత్వం అక్కడి రైతులకు అందించే భారీ సబ్సిడీల కారణంగా ఉత్పత్తులు తక్కువ రేట్లకు ఇండియాలోకి ఎంట్రీ ఇవ్వటం ఇక్కడి రైతులను, వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అలాగే మొక్క జొన్న, సోయా, పత్తి, ఆపిల్స్, కెనోలా వంటి ఉత్పత్తులను అమెరికా నుంచి భారతదేశంలోకి దిగుమతి అంగీకరించటం వల్ల బయో సేఫ్టీ దెబ్బతినే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే జన్యు పరంగా మార్పిడి చేసిన ఆహారాలు భారతీయ ప్రజల ఆరోగ్యాలను కూడా దెబ్బతీసే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. అందుకే వాణిజ్య ఒప్పందంలో అగ్రి ఉత్పత్తులను పక్కనపెట్టాలని, పన్ను రహిత దిగుమతులకు భారత్ అంగీకరించకూడదని వారు కోరుతున్నారు.

## ఇది వాయనాడ్ గర్వించే విషయం: ప్రియాంక గాంధీ

**హైదరాబాద్ పెన్ పవర్:**వాయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ, కేరళలోని వాయనాడ్ జిల్లాకు చెందిన జిఐ-ట్యాగ్ రోబస్టా కాఫీకి కేంద్ర ప్రభుత్వ 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి' (వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్-ఓడీఓపీ) కార్యక్రమంలో వ్యవసాయ విభాగంలో గుర్తింపు లభించినట్లు ఎక్స్‌లో ప్రకటించారు. కేరళలో ఈ గౌరవం పొందిన మొదటి ఉత్పత్తిగా వాయనాడ్ కాఫీ నిలిచిందని తెలిపారు. ఈ గుర్తింపు వయనాడు రైతుల కష్టానికి, నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి నిదర్శనమని ఆమె వివరించారు. ఇది వాయనాడ్ గర్వించే విషయని సంతోషం వ్యక్తం చేశారు.ఓడీఓపీ కార్యక్రమం ప్రతి జిల్లా నుంచి ఒక ప్రత్యేక ఉత్పత్తిని గుర్తించి, బ్రాండ్‌గా ప్రమోట్ చేస్తూ స్థానిక ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా చేస్తుంది. వాయనాడ్ కాఫీ, తన ప్రత్యేక రుచి, నాణ్యతతో జిఐ ట్యాగ్‌ను కలిగి ఉంది. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సాంప్రదాయ సాగు పద్ధతులు దీని విజయానికి కారణం. నెదర్లాండ్స్‌కు ఎగుమతి చేసిన శాంపిల్స్ 88, 86 కప్ స్కోర్లతో స్పెషాలిటీ కాఫీగా గుర్తింపు పొందాయి.కేరళ ప్రభుత్వ 'క్లైమేట్ స్మార్ట్ కాఫీ ప్రాజెక్ట్' దీనికి తోడ్పాటునిచ్చింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 'వాయనాడన్ రోబస్టా' బ్రాండ్‌ను అంతర్జాతీయ మార్కెట్‌లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిన్న రైతులకు శిక్షణ, నాణ్యత మెరుగుదలపై అవగాహన కల్పిస్తోంది. వాయనాడ్ లో 80 శాతం చిన్న-స్థాయి రైతులు ఈ ప్రాజెక్ట్ ద్వారా లబ్ధి పొందుతున్నారు.ఈ ఒడీఓపీ గుర్తింపు వాయనాడ్ రైతులకు, ఆర్థిక వ్యవస్థకు ఒక మైలురాయి. 'వాయనాడ్ కాఫీ పార్క్' ప్రాజెక్ట్ చిన్న, గిరిజన, మహిళా రైతులకు మరిన్ని అవకాశాలను సృష్టిస్తోంది. ఈ విజయం వాయనాడ్ కాఫీని గ్లోబల్ స్పెషాలిటీ మార్కెట్‌లో స్థాపించడంతో పాటు, పర్యావరణ స్థిరత్వాన్ని, జీవవైవిధ్య సంరక్షణను ప్రోత్సహిస్తుంది.

## కోల్హాపురి చెప్పుల వివాదం తర్వాత ప్రైడా కీలక అడుగు: కళాకారులతో చర్చలకు బృందం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా ప్రైడా బ్రాండ్ 'కోల్హాపురి' స్ఫూర్తితో రూపొందించిన చెప్పులపై తలెత్తిన వివాదం తర్వాత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ విలాసవంతమైన ఫ్యాషన్ హౌస్ ఉన్నత స్థాయి బృందం ఈరోజు మహారాష్ట్రలోని కోల్హాపూర్ చేరుకుంది. రాత్రికి ఇక్కడి కళాకారులు, వ్యాపారులు, స్టేక్ హోల్డర్లతో చర్చ తర్వాత రేపు తిరిగి వెళ్లిపోనుంది. అలాగే మరో బృందం ఆగస్టులో ఇండియాకు రానున్నట్లు తెలుస్తోంది.గతంలో ప్రైడా తమ సరికొత్త కలెక్షన్‌లో భాగంగా 'లెదర్ శాండిల్స్' పేరుతో కోల్హాపురి చెప్పుల నమూనాను పోలిన డిజైన్‌ను విడుదల చేసింది. అయితే ఈ చెప్పుల ధరను రూ.90,000కు పైగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. వాటిని 'కోల్హాపురి'గా కాకుండా తమ స్వంత సృష్టిగా పేర్కొనడం తీవ్ర విమర్శలకు దారితీసింది. భారతదేశంలో శతాబ్దాలుగా వాడుకలో ఉన్న, కేవలం కొన్ని వందల రూపాయలకే లభించే కోల్హాపురి చెప్పులను ఇంత భారీ ధరకు విక్రయించడం, వాటి మూలాన్ని విస్మరించడంపై నెటిజన్లు, కళాకారులు, మేధావులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరికి ఈ వివాదం ప్రైడా బ్రాండ్ ప్రతిష్టను దెబ్బతీసింది. దేశవ్యాప్తంగా చర్చ తర్వాత వెనక్కి తగ్గిన సంస్థ తాము రూపొందించిన డిజైన్‌కు 'కోల్హాపురి' చెప్పులే స్ఫూర్తి అని అంగీకరిస్తూ.. తమ వెబ్‌సైట్ నుంచి ఆ ఉత్పత్తులను తొలగించింది. ఇప్పుడు కేవలం వివాదాన్ని సద్దుమణిగేలా చేయడమే కాకుండా, నిజమైన కోల్హాపురి కళాకారులకు మద్దతుగా నిలిచేలా ప్రైడా ఒక అడుగు ముందుకు వేసే ప్రయత్నంలో ఉంది. మహారాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ కూడా ఈ వివాదంపై స్పందించింది. తాము విక్రయిస్తున్న చెప్పులకు జీఐ ట్యాగ్ ఇవ్వాలని అలాగే స్థానిక కళాకారులతో కలిసి వ్యాపారం చేసేందుకు ముందుకు రావాలని సూచించిన సంగతి తెలిసిందే.కోల్హాపూర్‌కు చేరుకున్న ప్రైడా బృందం స్థానిక చెప్పుల తయారీదారులతో, కళాకారుల సంఘాలతో చర్చలు జరపనుంది. వారి నైపుణ్యాన్ని, చేతిపనిని దగ్గరగా పరిశీలించి, భవిష్యత్తులో వారితో కలిసి పనిచేసే అవకాశాలను అన్వేషించనుంది. ఇది కార్యరూపం దాల్చితే కోల్హాపురి కళాకారులకు అంతర్జాతీయ వేదిక లభించడమే కాకుండా, వారి అద్భుతమైన చేతిపని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందనుంది.

# ఎటూ తేలని పంచాయతీ.. సమావేశం లో ఎవరి వాదనలు వారివే




**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తి సమావేశం ముగిసింది. జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో దాదాపు గంటన్నర సేపు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో రెండు రాష్ట్రాలకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రులు, అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టును ఏకైక అజెండాగా ఏపీ ప్రభుత్వం పెట్టింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం పదమూడు అంశాలతో అజెండాను ప్రవేశపెట్టింది. ఈ సమావేశంలో ఎవరి వాదనలను వారు వినిపించినట్లు తెలిసింది. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం లేదని ఏపీ ప్రభుత్వం తెలిపింది.

**చంద్రబాబు వాదనలో...**

గోదావరి నుంచి ప్రతి ఏటా వందల సంఖ్యలో టీఎంసీల వరద జలాలు సముద్రంలో కలసి పోతున్నాయని, వృధాగా పోయే నీటిని మాత్రమే తాము వినియోగించుకునేలా ప్రాజెక్టును డిజైన్ చేశామని, పెన్నా నదికి గోదావరి వరదనీటి జలాలను తరలించి అక్కడి నుంచి వెనకబడిన రాయలసీమకు తరలించేందుకు మాత్రమే ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశంలో చెప్పినట్లు సమాచారం. తాము గతంలో తెలంగాణ అనేక ప్రాజెక్టులు నిర్మించుకుంటున్నా అడ్డు చెప్పలేదని, రెండు తెలుగు రాష్ట్రాలు నీటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నదే తమ ఉద్దేశ్యమని, రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందడమే తమ ఆలోచన అని చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. బనకచర్లకు అన్ని అనుమతులు వచ్చేలా చూడాలని, ఇది ఏపీలోని రాయలసీమ రైతాంగానికి గేమ్ ఛేంజర్ అని కూడా చెప్పినట్లు తెలిసింది.

**రేవంత్ అభ్యంతరంతో...**

అయితే ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభ్యంతరం చెప్పినట్లు చెబుతున్నారు. గోదావరి నదిలో నికర జలాలతో పాటు వృధా జలాల వాటాను తేల్చాలని కోరినట్లు తెలిసింది. ముందుగా తాము ఇప్పటికే కృష్ణా, గోదావరి నదిపై నిర్మించతలపెట్టిన అనేక నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి అనుమతులు రాలేదని, ముందుగా వాటికి అనుమతులు ఇచ్చిన తర్వాత తాము ప్రాజెక్టులు నిర్మించిన తర్వాత మాత్రమే బనకచర్లకు అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్పష్టంగా సమావేశంలో చెప్పినట్లు తెలిసింది. తెలంగాణకు దక్కాల్సిన చుక్కనీటిని కూడా తాము వదులుకోబోమని ఆయన సమావేశంలోనే వ్యక్తం చేసినట్లు తెలిసింది. ట్రైబ్యునల్, చట్టాలను ఉల్లంఘించి నిర్మించే ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వవద్దని రేవంత్ రెడ్డి కోరినట్లు సమాచారం. దీంతో కేంద్ర జలశక్తి శాఖ తాము అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటామని, అవసరమైతే మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గంటన్నర సేపు సాగిన ఈ సమావేశంలో ఎటూ తేలకుండానే ముగిసిందంటున్నారు.

# ఇదేందయ్యా... జులై నెల చివరిలోనూ మే నెల వాతావరణం.. మీటర్లు గిర్రున తిరుగుతున్నాయ్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో మరో మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 19వ తేదీ వరకూ మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. దీంతో వాతావరణ శాఖ కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. దీనికి తోడు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని కూడా తెలియజేసింది. గంటకు ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాలు చురుగ్గా కదలడమే కాకుండా, బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే వాతావరణ శాఖ సూచనలు మేరకువర్షాలు పడటం లేదని ముఖ్యంగా అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

**ఈ నెల 19వ తేదీ వరకూ...**

తెలంగాణలోనూ ఈ నెల 19వ తేదీ వరకూ తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ చెప్పింది. సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే తెలంగాణలో చలి గాలులు తగ్గి ఉక్కపోత మొదలయింది. ఫ్యాన్లు, ఏసీలు నిరంతరంగా నడుస్తున్నాయి. విద్యుత్తు వినియోగం గత వారం రోజు లనుంచి పెరిగిందని విద్యుత్తు శాఖ అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించిన తొలినాళ్లలో ఒక మోస్తరు వర్షాలు కురిసినా తర్వాత మాత్రం ముఖం చాటేయడంతో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**వర్షాభావ పరిస్థితులు...**

ఆంధ్రప్రదేశ్ లోనూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. అల్పపీడనం ఏర్పడితేనే తప్ప భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని, అయితే అప్పటి వరకూ తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు ఆంధ్రప్రదేశ్ లో పడతాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ లో ఉష్ణోగ్రతలు గరిష్ట

స్థాయికి చేరుకన్నాయి. ఉక్కపోత మొదలవ్వడంతో జులై నెలలో మే నెల వాతావరణాన్ని తలపిస్తుంది. విద్యుత్తు మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో ముప్ఫయి శాతం లోటు వర్షపాతం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరో ఐదు రోజుల పాటు వర్షాలు పడినా ఆశించిన రీతిలో పడవని తెలిపింది. బలమైన ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

# ఎవరి వాదనలు వారివే




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో నేడు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. నీటిపారుదల ప్రాజెక్టులపై చర్చించనున్నారు. ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. కేంద్రం ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది ఆసక్తి కరంగా మారింది. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ వాదనలను కేంద్ర జలశక్తి మంత్రి ఎదుట వినిపించనున్నారు. బనకచర్లకు అనుమతివ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరుతుండగా, ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాదించనున్నారు. గోదావరి జలాల బోర్డు సమావేశంలో వరద నీటి పంపకాన్ని కేటాయించాలని పట్టుబడుతున్నారు.

**ఏపీ వాదన ఇలా...**

బనకచర్ల ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించలేదని, సీడబ్ల్యూసీ, పర్యావరణ అనుమతులు మాత్రమే తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వాదిస్తుంది. కేవలం సముద్రంలో పోతున్న వృధా జలాలను మాత్రమే వినియోగించుకుంటూ తాము బనకచర్ల ప్రాజెక్టును నిర్మించి గొంతు ఎండుతున్న రాయలసీమకు తాగునీటితో పాటు సాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని, సీడబ్ల్యూసీ అనుమతి తీసుకుంటామని, వృధాగా సముద్రంలో కలిసే నీటిని పెన్నా నదిలో కలుపుతామని ఆంధ్రప్రదేశ్ చెబుతుంది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా కాళేశ్వరం, దేవాదుల వంటి ప్రాజెక్టులను నిర్మించిన విషయాన్ని ఏపీ ప్రభుత్వం గుర్తు చేస్తుంది.

**తెలంగాణ వాదన ఇలా...**

మరొకవైపు ఎగువన ఉన్న తమ రాష్ట్రం గోదావరి వరద జలాల నీటిని మళ్లించినందున తెలంగాణ రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాదించనున్నారు. ముందు నీటి వాటాలను కేటాయించి, కృష్ణా నదిపై తమ ప్రాజెక్టులకు అన్ని అనుమతులు ఇచ్చిన తర్వాత మాత్రమే ఏపీకి అనుమతించాలని రేవంత్ రెడ్డి కోరనున్నారు. వృధా జలాల పేరుతో తమకు దక్కాల్సిన నీటి వాటాను తరలించుకుపోతే తెలంగాణ ప్రజలు నష్టపోతారని, అందుకే ఇతర ప్రాజెక్టులపై కూడా చర్చించి బనకచర్లపై తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరనున్నారు. మొత్తం మీద రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీలోనే ఉన్నారు. చంద్రబాబు ఎన్డీఏ కూటమిలో ఉండటంతో తనకు అనుకూలంగా కేంద్రం వ్యవహరిస్తుందని నమ్ముతున్నారు. అలాంటి నిర్ణయం తీసుకుంటే తాము అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి కేంద్రాన్ని ఎలా కట్టడి చేయాలో తమకు తెలుసునని తెలంగాణ ముఖ్యమంత్రి అంటున్నారు. మొత్తం మీద ఎవరి వాదన వారిదే. కానీ కేంద్రం మాత్రం ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.